క్లుప్తంగా

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

ఆరుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్: హనుమకొండ నుంచి పాలకుర్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు అదుపుతప్పి స్టేషన్‌ఘన్‌పూర్ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లిన ఘటన గురువారం జరిగింది. స్థానికులు, ఆర్టీసీ డ్రైవర్ సంపత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివరాత్రి సందర్భంగా హనుమకొండ నుంచి పాలకుర్తికి ప్రత్యేకంగా ఆర్టీసీ స్పెషల్ బస్సును నడిపించారు. ఈ క్రమంలో వరంగల్–1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో హనుమకొండ నుంచి పాలకుర్తికి బయలుదేరింది. ఈ క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ శివారు లిటిల్‌ఫ్లవర్ స్కూల్ సమీపాన ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారులను డ్రైవర్ తప్పించే క్రమంలో బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. బస్సు భాగం దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న డ్రైవర్లు

రఘునాథపల్లి: ఫతేషాపూర్ గ్రామానికి చెందిన జనగామ ఆర్టీసీ హెయిర్ బస్సు డ్రైవర్ గడ్డం మహేందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. సమాచారం తెలుసుకున్న సహచర ఆర్టీసీ హెయిర్ అసోసియేషన్ బస్సు డ్రైవర్లు గురువారం ఫతేషాపూర్ చేరుకుని మృతుడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.55 వేల నగదు, 50 కేజీల బియ్యం అందజేసి ఔదార్యం చాటారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బోనగిరి భిక్షపతి, ఉపాధ్యక్షులు చేవెళ్లి కొమురయ్య, బాల్నె రమేష్, కోశాధికారి దామెర వెంకటేశ్వర్లు, డ్రైవర్లు కమలాకర్‌రెడ్డి, చెవుల రాజు, నాగరాజు, లింగం, ప్రసాద్, రఫీక్, నరేష్, కండక్టర్లు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పశువు మృతి



మృతి చెందిన పశువు వద్ద రోదిస్తున్న రైతు

జఫర్‌గఢ్: పంట పొలాల వద్ద మేత మేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో పశువు మృతి చెందిన సంఘటన మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం .. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు గాదె నాగయ్యకు చెందిన పశువు రోజు మాదిరిగా తమ్మడపల్లి (జి) గ్రామ శివారులోని ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 50 వేల విలువ చేసే పశువు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకోవాలి

జఫర్‌గఢ్: కోనాయిచలం గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన జోగు బాబు, రాజు కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు కోరారు. పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు.

నియామకం

చిల్పూరు: భూమాత రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన దేవి ఇల్లందుల అనిల్‌ను నియమించినట్లు ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షుడు సాదం గట్టయ్య యాదవ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకుని రాష్ట్ర, జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు.

శంకుస్థాపనలకే పరిమితం

- నిర్మాణ దశలో మగ్దుంతండా, తీగారం జీపీ భవనాలు
- పట్టించుకోని పాలకులు, సంబంధిత అధికారులు
- పూర్తి చేయాలని కోరుతున్న స్థానికులు



మగ్దుంతండాలో పిల్లర్ల దశలో ఉన్న భవనం



జఫర్‌గఢ్ జీపీ భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

జఫర్‌గఢ్: గ్రామాల్లో నూతనంగా చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాలు రెండు గ్రామాల్లో మినహా మిగతా చోట్ల శంకుస్థాపనలకే పరిమితయ్యాయి. వీటిని పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీలు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా 2022–23 సంవత్సరానికి గాను ఎన్‌ఆర్‌ఈజీఎస్ (ఉపాధిహామీ) ద్వారా మండలంలోని ఆరు జీపీలకు నూతన భవనాలను మంజూరు చేసింది. ఒక్కో గ్రామపంచాయతీ భవనానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇట్టి నిధులతో జఫర్‌గఢ్, సూరారం, తమ్మడపల్లి (జి), మగ్దుంతండా, లక్ష్మీనాయక్‌తండా, తీగారం గ్రామాల్లో కొత్తగా జీపీ భవనాలకు అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య చేతుల మీదుగా శంకుస్థాపనలు చేశారు. ఇందులో తమ్మడపల్లి (జి), సూరారం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంతో కార్యకలపాలు నిర్వహిస్తున్నారు. కానీ తీగారం, మగ్దుతండాల్లో భవన నిర్మాణాలు మొదటి దశలో ఉండగా జఫర్‌గఢ్, లక్ష్మీనాకయ్‌తండాలో మాత్రం శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. వీటిని పూర్తి చేసేందుకు ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పైగా భవన నిర్మాణ ఖర్చులు పెరగడంతో వీటిని పూర్తి చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఒకవేళ నిర్మాణ పనులు చేపడితే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరవుతాయో లేదోనని వెనుకంజ వేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు నిర్మాణ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే పాత గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థలో ఉండడం, సరిపడా గదులు లేకపోవడంతో పాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పైగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాదవుతుండడంతో వీటిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసి నూతన గ్రామ పంచాయతీ భవనాలు పూర్తి అయ్యేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి

ఎన్‌ఆర్‌ఈజీఎస్, ట్రైబల్‌వేల్ఫర్ ద్వారా ఆరు నూతన గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా అందులో తమ్మడపల్లి (జి), సూరారం భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. తీగారం, మగ్దుంతండాలో జీపీ భవనాలు నిర్మాణ దశలో ఉండగా జఫర్‌గఢ్, లక్ష్మీనాయక్ తండాలో మాత్రం పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వీటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రామకృష్ణరావు, ఏఈ, పంచాయతీరాజ్

భవన నిర్మాణ పనులు చేపట్టాలి



జఫర్‌గఢ్‌లో నూతన జీపీ భవనం కోసం శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తోంది. ఇప్పటి వరకు నిర్మాణ పనులు ఏమాత్రం మొదలు పెట్టలేదు. భవన నిర్మాణ పనుల విషయంలో సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో శంకుస్థాపనకే పరిమితమైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– కుక్కల ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యులు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జఫర్‌గఢ్: ఇల్లు దగ్ధమవడంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని కోనాయిచలం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు జోగు బాబు, రాజు ఇల్లు షాక్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత అధికారులతో కలిసి బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కాలిపోయిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన పని లేదని అన్ని విధాలా ఆదుకుంటానన్నారు. బాధితులకు వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానన్నారు. ఇల్లు కట్టుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబాలకు క్వింటా బియ్యంతో పాటు ఆర్థికసాయం అందించారు.

'నిబంధనలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి'



డ్రెయినేజీ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని చూపిస్తున్న కాలనీవాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా అన్ని చోట్ల సమాన వెడల్పుతో చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు వంగపండ్ల మహేందర్, ఎండీ.మైబు పాషా డిమాండ్ చేశారు. ఇప్పగూడెం గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కాంట్రాక్టర్, నాయకులు ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులతో కలిసి వారు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు 33 ఫీట్ల వెడల్పుతో చేపట్టాల్సి ఉండగా కాంగ్రెస్ పార్టీకి అనువుగా ఉన్నవారి ఇళ్ల వద్ద ఒకటి, రెండు ఫీట్లు తగ్గించి పోస్తూ ఇతరులకు నష్టం చేస్తున్నారన్నారు. డ్రెయినేజీల మధ్యలో విద్యుత్ పోల్‌లతో భవిష్యత్‌లో కాలనీవాసులకు విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్ గొడుగు రాజయ్యను సంప్రదించగా సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, డ్రెయినేజీ మధ్యలో ఉన్న విద్యుత్‌పోల్‌లను తొలగింపచేస్తామని, నిబంధనల మేరకే రోడ్డు పోస్తున్నామని తెలిపారు. అజయ్‌కుమార్, ప్రకాశం, అజయ్, నర్సయ్య, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగు నీరు అందించాలి



పొట్టిగుట్ట తండాలో ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఎండిపోతున్న వరి పంటలకు కెనాల్ కాల్వల ద్వారా సత్వరమే సాగు నీరు అందించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని పొట్టిగుట్ట తండాలో ఎండిన వరి పంటలను రైతులతో కలిసి దయాకర్‌రావు పరిశీలించారు. పంటకు నీళ్లు లేక ఎండిపోవడంతో చేసేదేమిలేక గొర్రెల మేతకు పంటను వదిలేసిన తీరును పరిశీలించి దయాకర్‌రావు రైతులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో నీళ్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో నీరు అందిస్తే వెయ్యి ఎకరాల పంట సాగవుతుందన్నారు. దయాకర్‌రావు వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామిరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకుడు బస్వ మల్లేష్ తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

రఘునాథపల్లి: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ మోహిన్‌ముజ్జిబ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహాదేవస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ కూరెల్లి ఉపేందర్–రేణుక దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణాలతో అభిషేకాలు, పూజలు, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీఐ, తహసీల్దార్, ఎస్సై నరేష్‌ను శాలువాలతో సత్కరించారు. కృష్ణమూర్తి, వేదకుమార్, చిరంజీవులు, వినయ్‌కుమార్ లింగయ్య, పోషనాథం, బాలరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ముగ్గురి ప్రసవం

- తల్లులు, బిడ్డలు క్షేమం
- వైద్యులను అభినందించిన డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు



తల్లి, బిడ్డల క్షేమం వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో ఒకే రోజు ముగ్గురు ప్రసవించడంతో గురువారం జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు సందర్శించారు. మాతా శిశు సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచాలన్నారు. రాత్రి డ్యూటీ డాక్టర్ కూడా అందుబాటులో ఉంటున్నాడని అన్నారు. పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురికి సాధారణ ప్రసవాలు జరగడంతో తల్లులు, బిడ్డల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యుడు సిద్దార్థరెడ్డిని అభినందించారు. డాక్టర్ భాస్కర్, ఉష, వైద్య సిబ్బంది ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, లిల్లీ డబేరా ఉన్నారు.

ఊరూరా ఘనంగా బోనాలు



బచ్చన్నపేట: బోనాలతో వెళ్తున్న మహిళలు



దేవరుప్పుల: బోనంతో ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్మెట/బచ్చన్నపేట: నర్మెట మండల కేంద్రంలోని దుర్గామాతకు గ్రామస్తులు ఘనంగా బోనాలను చేశారు. గ్రామంలో మార్చి 1, 2 తేదీల్లో చేయనున్న దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా గ్రామ దేవతలకు బోనాలను చేసి మొక్కులు చెల్లించారు. కాగా దుర్గామాత ఉత్సవాలకు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. అలాగే బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్లలో బద్దిపోచమ్మ ప్రతిష్ఠ పూజ కార్యక్రమం ప్రారంభించగా గ్రామస్తులు బోనాలు చేసి అమ్మవారికి సమర్పించారు.

బోనం ఎత్తిన ఎర్రబెల్లి

దేవరుప్పుల : ధర్మాపురంలో మహాశివరాత్రి పురస్కరించుకుని ముందస్తుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా పోచమ్మ తల్లికి ఊరంతా బోనాలు చేసి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఉత్సవంలో పాల్గొని మహిళలతో కలిసి నెత్తిన బోనమెతుకుని మొక్కులు చెల్లించారు.



పోచమ్మ బోనాల్లో ఝాన్సీరెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం

ఆధ్యాత్మిక చింతనతో శాంతి సమాజం నెలకొంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. మండలంలోని ధర్మాపురం గ్రామంలో పోచమ్మతల్లి బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి, నాయకులు ఉప్పల సురేష్, భోనగిరి యాకస్వామి, రెడ్డి రాజుల రమేష్, దొపాటి రవి, నర్సయ్యలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ శంకరయ్య, రైతులు

లింగాలఘణపురం: కళ్లెం గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియిన వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును దొంగిలించినట్లు ఏఈ శంకరయ్య తెలిపారు. ఎస్‌ఎస్–2, ఎస్‌ఎస్–25 నంబర్‌గల రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైరు దొంగిలించడంతో ఏఈ శంకరయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి సుమారు రూ.30వేల నష్టం జరిగినట్లు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

జనగామ/రఘునాథపల్లి/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: జనగామ పట్టణంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వరాలయం, బతుకమ్మ కుంటలోని విజయ దుర్గామాత ఆలయాల్లో గురువారం వేద పండితులు గంగు సాంబమూర్తి, ఆరాధ్యశర్మ మంత్రోచ్ఛారణల నడుమ శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పిట్టల సత్యం, వాంకుడోతు అనిత, అనిల్ కుమార్, వెంకన్న, ప్రభాకర్, కుక్క సావు ఆంజనేయులు, సౌమ్య, శ్రవణ్, రాణి, రేణుక, హైమా, శ్రీకాంత్, విగ్నేష్, ప్రవీణ్, మాధవి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు. రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సిద్దివీరేశం కుమారులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శివ పార్వతులను పట్టు వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపైకి మేళతాళాలతో తీసుకొచ్చారు. బుధవారం అర్ధరాత్రి ఆలయ అర్చకులు పాగాల మఠం సాయి శివప్రసాద్, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకల్లో ఫతేషాపూర్ గ్రామ అభయాంజనేయస్వామి ఆధ్యాత్మిక సేవా భజన, కోలాట బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హింగె మైసారావు సారథ్యంలో బృందం పంచాక్షరి మంత్రంతో మారుమోగించారు. కోలాటాలు, భజనలతో భక్తులను విశేషంగా ఆలరించారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని కొన్నె, చిన్నరామన్‌చర్ల, జఫర్‌గఢ్ మండల కేంద్రం, కూనూర్ శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. గురువారం మండలంలోని కొన్నెలోని శివాలయంలో మహా అన్నదానం నిర్వహించారు.



జనగామ: గుండ్లగడ్డలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రఘునాథపల్లి: శివపార్వతుల కల్యాణ వేడుకల్లో ఫతేషాపూర్ కోలాట, భజన బృందం

మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం

తరిగొప్పుల: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని అబ్దుల్‌నాగారం శివారులోని పంగిడి మల్లన్నస్వామి జాతర కన్నులపండువగా జరిగింది. గురువారం ఒగ్గు కళాకారులు స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఒగ్గుకథ పూజారులు భక్తిశ్రద్ధలతో వేసే పెద్దపట్నాన్ని, స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం ఒగ్గు పూజారులు స్వామివారిని గంగస్నానానికి తీసుకెళ్లి పసుపు, కుంకుమలతో పెద్దపట్నం వేసి కమణీయంగా కల్యాణం నిర్వహించారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



పాలకుర్తి టౌన్: క్యూలో నిల్చున్న ఉపాధ్యాయ ఓటర్లు



స్టేషన్‌ఘన్‌పూర్: ఓటుహక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు



లింగాలఘణపురంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా



రఘునాథపల్లి/దేవరుప్పుల: పోలింగ్ కేంద్రం నుంచి వస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీలు, ఆర్డీఓలు, తహసీల్దార్‌లు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా మండలాల సీఐలు, ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షించారు.

ఎన్నికల సరళిని పరిశీలించిన బీజేపీ నాయకులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు స్టేషన్‌ఘన్‌పూర్‌లో, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి జిల్లా కేంద్రం, పాలకుర్తిలో పర్యటించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, కేవీఎల్‌ఎన్‌రెడ్డి, రమణగౌడ్ తదితరులతో కలిసి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.



జఫర్‌గఢ్: ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో డీసీపీ రాజమహేంద్రనాయక్



చిల్పూరు: పోలింగ్ కేంద్రానికి వస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న



నర్మెట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ నితిన్ చేతన్



జనగామ: మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: నాయకులతో మాజీ మంత్రి విజయరామారావు



బచ్చన్నపేటలో.. ఆర్డీఓ గోపీరావు